## శాంతిపర్వ కథాంశాలు

మహాభారతము పదునెనిమిది పర్వములలో శాంతిపర్వము బృహదాకారముగలది. ఇందు రాజధర్మానుశాసనము, ఆపద్ధర్మము, మోక్షధర్మమను మూడు ఉపపర్వములు, 365 అధ్యాయములు, 14177 శ్లోకములు కలవు. కురుక్షేత్రయుద్ధమున సోదర, మిత్ర, బంధువులను పోగొట్టుకొని చింతాక్రాంతుడైన యుధిష్ఠిరుని కలియుటకు వ్యాస, నారద, దేవల, కణ్వాది మహర్షులు వచ్చిరి. వ్యాకులచిత్తుడగు రాజును ఓదారుస్తూ మొదటగ నారదుడు చింతకు కారణమేమని యుధిష్ఠిరుని అడిగెను. యుధిష్ఠిరుడు మహర్షీ! నిగూఢముగా కుంతీగర్భమునుండి జన్మించిన కర్ణుడు మాపెద్ద సోదరుడని వింటిమి. అజ్ఞానముచే రాజ్యలోభమున పడి సోదరునిచే సోదరుని చంపించితిని. ఇది నా అవయవములను దహించుచున్నది. నారదా! యుద్ధక్షేత్రమున కర్ణుని రథచక్రము భూమిలో ఎందుకు దిగపడెనో, అతని శాపమునకు కారణమేమో? తెలియజేయుడని ప్రార్థించెను. నారదుడు కర్ణుని శాపవృత్తాంతమును తెలియజేసెను. దేవతలు భూమండలమందలి క్షత్రియులందరు అస్త్రశస్త్రముల ఆఘాతములతో పవిత్రుడై స్వర్గలోకమునుపొందు ఉపాయమును ఆలోచించి సూర్యుని ద్వారా కుంతీ గర్భమందు కౌరవపాండవ సంఘర్షమునకు కారణమైన తేజోమయుడగు బాలకుని పుట్టించిరి. కనుకనే కర్ణుడు పాండవులంటే మండిపడుచూ కౌరవపక్షమున చేరినాడు. అతడి దుర్బుద్ధిని తెలుసుకొని ద్రోణాచార్యుడు అస్త్రవిద్యకై పరశురాముని వద్దకు వెళ్ళుమని సలహా ఇచ్చినాడు. కర్ణుడు తనను భృగువంశ బ్రాహ్మణకుమారుడనని పరిచయం చేసుకొని పరశురాముని ఆశ్రయించెను. ఒకరోజు భ్రమచే మృగమనుకొని బ్రాహ్మణుని హోమధేనువును చంపగా కోపగించిన బ్రాహ్మణుడు నరాధమా! నీవు ఎవ్వరిని ఎల్లప్పుడూ విరోధించుచుందువో అతనితో యుద్ధము చేయుసమయమున నీ రథచక్రము భూమిలో క్రుంగగలదు. అట్టి అవస్థలో శత్రువు నీశిరస్సు ఖండిచగలడని శపించెను. గురుశుశ్రూషతో సంతసించిన పరశురాముడు కర్ణునికి బ్రహ్మాస్త్రవిద్యను నేర్పెను. ఒకరోజు అలసిన పరశురాముడు కర్ణుని ఒడిలో శిరస్సునుంచుకొని పరుండెను. ఆ సమయమున అలర్కమను పేరుగల మాంసాహారియగు విషకీటకము కర్ణుని తొడను చేరి గాయము చేసెను. గురువుకు నిద్రాభంగము జరుగు నను భయముతో

అసహ్యమగు వేదనను అతడు సహించెను. కాని కర్ణుని తొడనుండి కారెడి రక్తప్రవాహస్పర్శచే పరశురాముడు మేల్కొనెను. కర్ణుని సూతపుత్రునిగా తెలుసుకొని అబద్ధమాడుటవలన కోపగించిన పరశురాముడు నీతో సమానమగు వీరునితో యుద్ధము
చేయునంతవరకే నీకు బ్రహ్మాస్త్రవిద్య స్మృతిపథమున నుండునని శపించెను. బ్రహ్మాస్త్రమును పొందిన కర్ణుడు దుర్యోధనుని చేరి అతనితో ఆనందముగా నుండసాగెను. కర్ణుని సాయముతో దుర్యోధనుడు కలింగదేశ రాజగు చిత్రాంగదుని కన్యను స్వయంవరసభనుండి అపహరించెను. మహారథి కర్ణుడు జరాసంధునికూడా ఓడించెను. రాజా! నీసోదరుడగు కర్ణునకు ఈవిధముగా శాపము వచ్చినది. యుద్ధమందు వీరగతిని పొందుటచే శోకించవలసిన పనిలేదని చెప్పెను. అత్యంతము
ఖిన్నుడైన యుధిష్ఠిరుడు అమ్మా! ఈ విషయమును రహస్యముగనుంచి నాకు చాలా కష్టమును కల్గించితివి. ఈ రోజునుండి స్త్రీలమనస్సులో దాచవలసిన విషయముకూడా దాగదని శపించెను. అత్యంతము వ్యాకులుడైన ధర్మరాజు రాజ్యభోగము, జీవితమునుండి విరక్తిచెందెను. అతడు అర్జునునితో అర్జునా! రాజ్యమును నీవు పాలింపుము. రాజ్యభోగములమీద నాకు కోరిక లేదు. అన్ని బంధములను విడిచి నేను వనమునకు వెళ్ళెదనని పలుకగా అర్జునుడు యుధిష్ఠిరుని అభిప్రాయమును నిరాకరిస్తూ రాజ్యధర్మమును పాలింపుమని ఉపదేశించి యజ్ఞానుష్ఠానమునకు ప్రేరేపించెను. కాని యుధిష్ఠిరుడు వీతరాగుడై మునులవలె జీవితమును గడిపెదనని గట్టిగా చెప్పెను. భీమసేనుడు యుధిష్ఠిరుని అభిప్రాయమును నిరాకరిస్తూ కర్తవ్యపాలనకు ఉపదేశము చేసెను. మరల అర్జునుడు పక్షిరూపధారి ఇంద్రుడు, ఋషిబాలురసంవాదము వినిపించి
గృహస్థధర్మమును పాటించమని సూచించెను. నకులుడు గృహస్థధర్మము యొక్క మహత్త్వమును ఉపదేశించెను. సహదేవుడు భారతా! రెండక్షరముల "**మమ**" మృత్యువు. మూడక్షరముల "**న మమ**" శాశ్వతిక బ్రహ్మపదార్థము.రెండునూ మనయందే ఉన్నవి. రాజా! మహాపురుషుల మార్గము నాశ్రయింపుమని పలికెను. ద్రౌపది ధర్మపూర్వక ప్రజా పరిపాలనకై ప్రేరేపించెను.రాజదండము మహత్త్వము చెప్పుచు బ్రాహ్మణుడు అపరాధము చేసినచో మాటలతో అవమానించుటయే అతనికి

దండము. పనిచేయించుటయే క్షత్రియులకు దండము. అపరాధరుసుము వసూలు చేయుటయే వైశ్యులకు దండము. శూద్రులు దండరహితముగా చెప్పబడుచున్నారు. దండము న్యాయోచితముగ ప్రయోగించినచోట పాప, వంచనలకు అవకాశముండదు. కనుక రాజా! దండము మహత్త్వము తెలుసుకొని దానిని ఉత్తమరీతిలో ఉపయోగించుచు ప్రజాపాలన చేయవలసినది అని ఉపదేశించెను. భీమసేనుడు అజ్ఞాతవాససమయమున వారనుభవించిన దుఃఖములను గుర్తుచేయుచు రాజ్యశాసనముచేయుమని ఉపదేశించి అశ్వమేధయాగమునకు ప్రేరేపించెను. భీముని మాటలను విరోధిస్తూ యుధిష్ఠిరుడు

భీమసేనా! అసంతోషము, ప్రమాదము, మదము, రాగము, అశాంతి మున్నగు పాపములు నిన్ను ఆవరించియున్నవి. కనుకనే నీకు రాజ్యముపై మోహము కల్గుచున్నది.బుద్ధిమంతులు, తాపసులే సచ్చిదానంద స్వరూపుడగు బ్రహ్మపదార్థమును పొందుదురు ఇతరులు పొందలేరని చెప్పెను. మరల అర్జునుడు విదేహరాజుజనకుడు వారి పట్టపు రాణి ఇద్దరి సంవాదమును వినిపించి యుధిష్ఠిరుని సన్యాసాశ్రమమునుండి విముఖుని చేయుటకు ప్రయత్నించెను. యుధిష్ఠిరుడుతిరిగి తన అభిప్రాయమును సమర్థించు కొనెను. తరువాత మహా తపస్వి దేవస్థానుడు ధర్మముతో జయించిన రాజ్యమును త్యజించుట అనుచితమని పలికి యజ్ఞానుష్ఠానమునకు ప్రేరేపించెను. క్షత్రియధర్మముయొక్క గొప్పతనముచెప్పి అర్జునుడు యుధిష్ఠిరుని సముదాయించెను. వ్యాసమహర్షిగృహస్థ ఆశ్రమం గొప్పతనం చెప్పి దానిని పాలించమని ఉపదేశించెను. యుధిష్ఠిరుడు ప్రశ్నించగా మహర్షి శంఖలిఖితుల కథ వినిపించి దండధారణమే క్షత్రియధర్మమని పలికెను. వ్యాసమహర్షి భారత! యయాతి వలె భూమండలమును పాలింపుము. నీసోదరులు వనవాసకాలమున ఎన్నో కష్టములను అనుభవించిరి. సోదరులతో కలిసి ధర్మ, అర్థ, కామములనుభవించి పిమ్మట వనవాసమునకు వెళ్ళవలసినది. మొదట, సర్వమేధ, అశ్వమేధ యజ్ఞములను చేయవలసినది. కార్యసిద్ధిలో కాలమే సామాన్యకారణము. రాజా! మూఢుడవై ఎందుకు శోకించుచున్నావు? మరణించినవారిని మాటిమాటికి ఎందుకు స్మరించుచున్నావు. శోకమునకు వేలకొలది, హర్షమునకు వందలకొలది సందర్భములున్నవి. ఇవన్నియూ మూర్ఖునిపై ప్రభావము చూపును.

విద్వాంసునిపై గాదని ధైర్యము చెప్పెను. పిమ్మట యుధిష్ఠిరుడు అర్జునా! ధనమునకు మించినది మఱియొకటి లేదని నీవు అనుకొనుచున్నావు. నిర్ధనునకు సుఖములభించ దనునది అసత్యము. చాలామంది స్వాధ్యాయ యజ్ఞమాచరించి అభీష్టమును పొందెదరని చెప్పి శరీరమును త్యజించుటకు అనుమతినడిగెను. అశ్మఋషి జనకులసంవాదము ద్వారా వ్యాసమహర్షి యుధిష్ఠిరుని సముదాయించెను. శ్రీకృష్ణుడు కూడా శోకసాగరంలో మునిగిన ధర్మరాజును ఓదార్చెను. ఈ సందర్భములో శ్రీకృష్ణుడు పుత్రశోకంతో దుఃఖించెడి సృంజయరాజునకు నారదుడు ఉపదేశించిన దానిని వినిపించెను. యుధిష్ఠిరుడు శ్రీకృష్ణుని పర్వతముని పుత్రశోకంతో దుఃఖించే సృంజయునకు కాంచనష్ఠీవియును పుత్రుని ఎందుకిచ్చెను? అతనికి ఆపేరు వచ్చుటకు కారణమేమనియడుగగా శ్రీకృష్ణుడు సృంజయుని ఉపాఖ్యానమును వినిపించెను. వ్యాసమహర్షి యుధిష్ఠిరుని సముదాయిస్తూ రాజా! నీవు ధర్మద్రోహులను
చంపి ధర్మమును రక్షించితివి. కనుక విచారించవలదు. ఒకవ్యక్తిని చంపుటవలన కుటుంబమునకు గాని లేక ఒకకుటుంబమును నాశము చేయుటవలన సమస్తదేశమునకు గాని సుఖసంతోషములు లభించినచో ఆ విధముగ చేయుట దోషము కాదని ఉపదేశించెను.

యుధిష్ఠిరుడు శ్రీకృష్ణభగవానుని, వ్యాసాది మహర్షుల ఉపదేశవచనములను విని మానసిక దుఃఖమును విడిచి కర్తవ్యపాలనకై హస్తినకు చేరెను. నగర వాసులు పాండవులకు స్వాగతం పలికిరి. వైదిక బ్రాహ్మణుల మధ్య దుర్యోధనుని మిత్రుడు చార్వాకుడను రాక్షసుడు భిక్షుక వేషమున నిలబడి యుధిష్ఠిరుని నిందించసాగెను. అతని కపట వేషమును గుర్తించి బ్రాహ్మణులు అతనిని వధించిరి. యుధిష్ఠిరుడు రాజ్యాభిషిక్తుడాయెను. సమర్థులైన వ్యక్తులను ఆయాపనులయందు నియోగించెను. యుద్ధమున మృతిచెందిన బంధువర్గమునకు యుధిష్ఠిరుడు శ్రాద్ధకర్మ నిర్వహించెను. రాజాజ్ఞను పొంది అందరు వారి వారి ఇండ్లకు వెడలిరి. మరుసటి రోజు రాజు యధిష్ఠిరుడు శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళి ధ్యానముద్రలో నున్న వారిని పురుషోత్తమా! మీరు ఎవరిని ధ్యానించుచున్నారు. ఇదెంతో ఆశ్చర్యమును కల్గించుచున్నదని అడిగెను. శ్రీకృష్ణుడు రాజా! అంపశయ్యపై పడియున్న భీష్ముడు ఆరిపోవుచున్న అగ్నివలె అగుచు నన్ను ధ్యానించుచున్నాడు. కనుక నామనస్సు వారిపై

లగ్న మైయున్నది. భరతశ్రేష్ఠా! వారు త్రికాలజ్ఞులు. కర్మఫలముననుసరించి వారు స్వర్గలోకమునకు పోయెదరు. అప్పుడు ఈభూమి అమావాస్యరాత్రివలె కళావిహీనమగును. మీరు భీష్మునివద్దకు వెళ్లి పాదాభివందనము చేసి మనస్సులో నున్న సందేహములను తీర్చుకొనుడని యుధిష్ఠిరునితో చెప్పెను. యుధిష్ఠిరుడు భగవాన్! మనమందరం కలసి భీష్మునివద్దకు వెళ్ళెదము. ఉత్తరాయణ పుణ్యకాలమున వారు దేవలోకమునకు వెడలి పోవుదురు. కనుక వారికి మీదర్శనభాగ్యము తప్పనిసరి యని వాసుదేవుని కోరెను. శ్రీకృష్ణుడు సాత్యకిని రథమును సిద్ధముచేయుమని ఆదేశించెను. వ్యాసనారదాది మహర్షుల మధ్యనున్న భీష్ముడు శ్రీకృష్ణుని స్తుతించసాగెను. దీనినే భీష్మస్తవరాజమందురు. శ్రీకృష్ణుడు యోగబలముతో భీష్ముని సమీపించి వారికి దివ్యజ్ఞానము ప్రసాదించి తిరిగి వచ్చెను. భీష్ముడు శ్రీకృష్ణునిస్తుతించుట ఆగిపోగానే అచ్చటనున్న మహర్షులు గద్గద కంఠంతో అతనిని ప్రశంసించిరి.

శ్రీకృష్ణపాండవులు కురుక్షేత్రమున అంపశయ్యపై పరుండిన భీష్ముని చూచిరి. శ్రీకృష్ణుని చూచి భీష్ముడు వారికి నమస్కరించెను. శ్రీకృష్ణుడు భీష్మా!
సూర్యభగవానుడు దక్షిణాయనమునుండి ఉత్తరాయణమునకు మరలునప్పుడు మీరు ఉత్తమలోకములను పొందెదరు. జ్ఞానిపురుషుడు అచ్చటకు చేరి ఈ సంసారమునకు తిరిగిరాడు. పరలోకమునకు చేరగానే మీపూర్వజ్ఞాన మంతా లుప్తమగును. కనుక ధర్మ, అర్థయుక్తవచనములను ధర్మరాజునకు వినిపించి అతనిశోకమును దూరముచేయవలసినదని విన్నవించెను. కాని భీష్ముడు శరీరపీడ, ఇంద్రియములశైథిల్యముచే తన అసామర్థ్యమును ప్రకటించగా శ్రీకృష్ణభగవానుడు వారివ్యథ తొలగునట్లు వరమిచ్చెను. సాయంకాలమగుటచే భీష్ముని వద్ద సెలవు తీసుకొని అందరు వారివారి స్థానములకు వెళ్ళిరి. మరుసటి రోజు ఉదయము శ్రీకృష్ణుడు యుధిష్ఠిరాదులతో భీష్మునివద్దకు వచ్చెను. యుధిష్ఠిరుడు అడుగగా భీష్ముడు రాజధర్మములను వర్ణిస్తూ యుధిష్ఠిరా! పురుషప్రయత్నం లేకుండగ కేవలము ప్రారబ్ధంచే రాజుల ప్రయోజనము సిద్ధించదు. కనుక నీవు పురుషార్థసంపాదనకై ప్రయత్నించవలెను. సత్యమే విశ్వాసమునకు మూలకారణము. రాజు ఎల్లప్పుడు

ప్రయత్నశీలుడుగనుండవలెను. యుధిష్ఠిరా! నేను చెప్పినదంతా రాజధర్మములనెడి క్షీరముయొక్క నవనీతమని ఉపదేశించెను. సాయంకాలమగుటచే అందరు హస్తినకు చేరుకొనిరి. పిమ్మట మరుసటి రోజు ఉదయమున ప్రాతఃకాలికక్రియలను పూర్తి చేసుకొని యుధిష్ఠిరాదులు భీష్ముని వద్దకు వెళ్ళిరి. ధర్మరాజు రాజశబ్దవ్యుత్పత్తివ్యవహారముల నడుగగా భీష్ముడు భారతా! సత్యయుగ ప్రారంభమున రాజ్యము లేదు. రాజులేడు. దండముగాని దండించువాడుగాని లేడు. ధర్మమునాశ్రయించుకొని ప్రజలందరు ఒకరినొకరు రక్షించుకొనెడివారు. కొంతకాలము తరువాత పరస్పర సంరక్షమున ప్రజలు కష్టముల ననుభవించసాగిరి. వారిలో మోహము వ్యాపించెను. కర్తవ్యాకర్తవ్యవివేకశూన్యులై ధర్మమార్గమునుండి తొలగుచు లోభగ్రస్తులైరి. కామమను దోషము వారిని ఆవరించినది.

ఈ విధముగా మనుష్యలోకమున క్రమముగా ధర్మము, వైదికకర్మలహ్రాసము కలుగుచుండెను. యజ్ఞకర్మలు లుప్తమగుచుండుటవలన భీతిల్లిన దేవతలు బ్రహ్మను శరణువేడిరి. దేవతల కళ్యాణమునాలోచించి బ్రహ్మ తన బుద్ధివైభవముచే లక్ష అధ్యాయముల నీతిశాస్త్రమును సృజించెను. అందు ధర్మ, అర్థ, కామములు విస్తృతముగా వర్ణించబడినవి. ఆ ప్రకరణమునకు త్రివర్గమని పేరు. నాల్గవ వర్గము మోక్షమునకు సంబంధించినది. ఈ విధముగ భీష్ముడు నీతిశాస్త్రవిషయములను, రాజులమహత్త్వమును తెలియజేసెను. యుధిష్ఠిరుని ప్రశ్నలకు సమాధానముగ
భీష్ముడు వర్ణధర్మములు, ఆశ్రమధర్మములు, రాజుయొక్క ప్రధానకర్తవ్యములను ఉపదేశించుచు రాజు సరైన రీతిలో దండనీతిని ప్రయోగించిన అదియే సత్యయుగము యొక్క ఆరంభము. రాజే కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగ, కలియుగ సృష్టికి కారణభూతుడు. ధార్మికపాలనయే రాజుయొక్క కర్తవ్యమని చెప్పెను. రాజ్యమునుండి విరక్తుడైన యుధిష్ఠిరునకు రాజ్యముయొక్క మహిమను తెలియజేయుచు అనేక ఉపాఖ్యానములను వినిపించెను.

**(2) ఆపద్ధర్మ పర్వము :-**

ఈ ఉపపర్వమున 43 అధ్యాయములు గలవు. యుధిష్ఠిరుడు

భీష్ముడిని తాతా! సైన్యము, ధనసంపత్తి లుప్తమగుట మున్నగు కారణములచే రాజు ఆపదలలోనున్నప్పుడు శత్రువులు దండెత్తిన ఏమి చేయవలెనని అడుగగా భీష్ముడు రాజా! శత్రువు ధార్మికుడైన, అధార్మికుడైనను అతనితో తొందరగ సంధిచేసుకొనుట ఉత్తమమని చెప్పెను. రాజధర్మములను వర్ణిస్తూ భీష్ముడు నృపా! ఎవరోఒకరి మాట పట్టుకొని రాజు ఎవ్వరిని దండించుటగాని, సమ్మానించుటగాని చేయకూడదు. ఎవ్వరిని నిందించకూడదు. నింద వినకూడదు. శ్రేష్ఠపురుషుల మార్గమును అవలంబించుటయే శ్రేయస్కరము. కోశాగారమును వృద్ధిపరచుట రాజుకర్తవ్యము. దానివలననే ధర్మము, రాజ్య అభివృద్ధి జరుగును. ధర్మ, అధర్మ ఫలమును ప్రత్యక్షముగ ఎవ్వరు ఎప్పుడూ చూడలేదు. కనుక రాజు బలప్రాప్తికొఱకు ప్రయత్నించవలెను. ధర్మము బలము మీద ఆధారపడుటచే బలము శ్రేష్ఠమైనది. యజ్ఞశీలురగు పురుషులనుండి రాజుధనమును స్వాధీనము చేసుకొనవచ్చును. రాబోవు ఆపదను ముందుగా పసిగట్టి ఉపాయమునాలోచించువాడు ప్రత్యుత్పన్నమతియనబడును. ఈ సందర్భమున దూరదర్శి, తత్కాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడను మూడు చేపల వృత్తాంతమును వినిపించెను. బుద్ధిమంతుడు స్వార్థసిద్ధికొఱకు అవసరమును బట్టి శత్రువులతో సంధిచేసుకొనును. మిత్రులను విరోధించును. దానివలన గొప్పఫలమును లభించును. పిల్లి, ఎలుకల ఉపాఖ్యానము ద్వారా పైదానిని సమర్థించెను. బ్రహ్మదత్తుడు, పూజనియను చిలుక వీరిద్దరి సంవాదముద్వారా శత్రువులయెడల ఎల్లప్పుడూ జాగర్తగా నుండవలెనని పలికెను. యుధిష్ఠిరుడు భీష్ముని పితామహా! ఇప్పుడు లోకమున ధర్మప్రవృత్తి తగ్గుచున్నది. దుర్మార్గులు ధర్మమునకు బాధకల్గించుచున్నారు. ఇట్టి పరిస్థితులలో ఎట్లు వ్యవహరించవలెనని ప్రశ్నించెను. భీష్ముడు ఆపత్కాలీన నీతిని చెప్పుచూ
భారద్వాజకణిక, శత్రుంజయుల సంవాదమును వినిపించెను. విశ్వామిత్ర, చండాలుర కథను వినిపించి సంకటకాలమున బ్రాహ్మణుడు ఎట్లు జీవన నిర్వాహము చేయవలయునో ఉపదేశించెను. ధర్మమును గూర్చి చెబుతూ ఆపత్కాలమందుకూడా దుష్టశిక్షణము, శిష్టరక్షణము చేయవలెనని ఉపదేశించెను. శరణాగతులను రక్షించుటవలన కలుగు ధర్మమును వివరిస్తూ శరణాగతుడగు శత్రువును పావురము ఎట్లు సత్కరించెనో

తెలియజేసెను. పరశురాముడు ముచుకుందునకు పూర్వము ఈ కథను చెప్పెను. ఒకానొకసమయమున వ్యాధుడు మహారణ్యమున తిరుగుచుండెను. పక్షులను వేటాడి వాటిని అమ్ముట అతని వృత్తి. అరణ్యంలో తిరుగు సమయమున గాలివాన వచ్చెను. అడవి మార్గమంతా నీటితో నిండెను. చలితో బాధపడుచు వ్యాధుడు వ్యాకులచిత్తుడై అడవిలో అటూ ఇటూ తిరుగసాగెను. ఆసమయమున చలిబాధ తట్టుకోలేక అచేతనముగ నేలపై పడియున్న పావురమును చూచి నిర్దయుడై పక్షిని తన పంజరమున వేసుకొనెను. స్వయంగా దుఃఖపడుచున్నను వ్యాధుడు తిరిగి పాపకర్మ ఆచరించినాడు. పిమ్మట అతడు ఆ రాత్రికి ఒక చెట్టుక్రింద విశ్రమించెను. ఆ చెట్టుమీద పావురముల జంట నివసించెడిది. ఆడపావురము ఆహారము కొఱకు ఉదయముననేబయటకు వెళ్లి ఇంతవరకూ తిరిగి రాలేదు. ఆమెకోసం దుఃఖిస్తూ మగపక్షి ఇట్లు విలపించెను. "యజమానురాలు ఉన్న ఇల్లే ఇల్లు. ఆమె లేక పోయిన ఇల్లు అరణ్యముతో సమానము. నా భార్య ఉత్తమ వ్రతములను పాలించెడి పతివ్రత. నేను భుజించిన తరువాతనే ఆమె భోజనం చేయును. నేను పరుండిన పిమ్మట పరుండును. నేను సంతోషంగానున్నచో నాభార్య సంతోషముగానుండును. ఆమె ఎప్పుడూ నాక్షేమమునే కోరుచుండును. ఈలోకమున పురుషునికి స్త్రీతో సమానమగు బంధువు లేడు. స్త్రీతో సమానమగు ఆశ్రయము లేదు. ధర్మకార్య ఆచరణమున స్త్రీవలె సహాయపడు వారు మరొకరులేరు." పతివిలాపమును విని పంజరమున నున్న ఆడుపక్షి "నేనెంతో భాగ్యవంతురాలిని, నాపతి నన్ను కొనియాడుచున్నాడు. పతి సంతోషంతో నున్న స్త్రీలయెడలసమస్త దేవతలు అనుగ్రహంతోనుందురని" తలచి ఆడుపక్షి విలపిస్తున్న పతితో "ప్రాణనాథా! మీకు పుత్రులుకూడా కలిగారు. కనుక దేహంమీద మమకారం దూరంచేసుకొని వ్యాధునికి సహాయపడండి. మీరు నాకోసం విచారించవద్దు. శరీరయాత్రను నిర్వహించుటకు మీకు మరొక స్త్రీ దొరకగలదని" పలుకగా పావురము భార్యపలికిన ధార్మికవచనములకు మిక్కిలి సంతసించి వ్యాధుని సత్కరించి అతనితో నేను మీకు ఏమిసేవ చేయగలను. ఇంటికి వచ్చిన వాడు శత్రువైనను అతనికి ఆతిథ్యమీయవలెను. తనను నరుకుటకు వచ్చిన వానికి కూడా చెట్టు

నీడనిచ్చుచున్నది. అతిథి సత్కారములు గృహస్థధర్మమని పలికెను. పిమ్మట అది వ్యాధుని చలిపోగొట్టుటకు కమ్మరి వాని యింటికి వెళ్లి నిప్పుతెచ్చి ఎండుటాకులతో మంట చేసెను. వ్యాధుడు నాకు ఆకలివేయుచున్నది. భోజనము చేసెదనని పలుకగా తనవద్ద పెట్టుటకు ఏమీలేకపోవుటచే పావురము తిరిగి ఎండుటాకులను మంటపెట్టి అందుదూకెను. తనుచేసిన పనికి తనకుతాను నిందించుకొనుచు వ్యాధుడు విలపించెను. ధర్మకార్యాచరణకై నిశ్చయించి ఆడుపక్షిని పంజరమునుండి విడిచిపెట్టెను. అదికూడా అగ్నిలో ప్రవేశించి పతితో సహగమనము చేసెను. సత్కర్మవలన రెండిటికి స్వర్గము లభించెను.

యుధిష్ఠిరుడు భీష్ముని తెలియకుండగ పాపమాచరించిన దానినుండి ఎట్లు విముక్తులగుదురని ప్రశ్నించగ భీష్ముడు సమాధానముగ ఇంద్రోతముని జనమేజయుల వృత్తాంతమును వినిపించెను. యుధిష్ఠిరుడు పితామహా! మరణించి తిరిగి బ్రతికినవారినెవరినైనా మీరు చూచితిరా? అని భీష్ముని ప్రశ్నించగా సమాధానంగా భీష్ముడు బ్రాహ్మణబాలకుని కథను వినిపించెను. బ్రాహ్మణ బాలకుడొకడు బాలగ్రహంచే పీడింపబడి బాల్యావస్థలో మరణించెను. బంధువులు మృతశరీరమును తీసుకొని శ్మశానభూమికి చేరి విలపించసాగిరి. ఆకలితో నున్న గ్రద్ద అక్కడకు వచ్చి మృతుని బంధువులను యుక్తియుక్తములగు మాటలతో తిరిగి పొమ్మని చెప్పెను. ఆకలితో నున్న నక్క మరలిపోతున్న వారిని నివారించుటకు ప్రయత్నించుచుండెను. రెండు ఆకలితోనున్నవి. స్వార్థసిద్ధికొఱకు రెండును మృతబంధువులతో యుక్తియుక్తముగ మాటలాడుచున్నవి. సూర్యాస్తమయం అయిపోయింది వెళ్ళిపొమ్మని గ్రద్ద చెప్పుచుండగా వద్దని నక్క వారించుచున్నది. వారివాదవివాదంతో అందరు అక్కడనేనుండిరి. చివరకు పరమేశ్వరుడు అనుగ్రహం వలన బాలుడు పునరుజ్జీవితుడాయెను. పరమేశ్వరుడు నక్క, గ్రద్దలకు ఆకలితొలగునట్లు వరమిచ్చెను. ప్రబలవ్యక్తి దుర్బలుని ఆక్రమించిన దుర్బలుడు అతనితో ఎట్లు వ్యవహరించవలెనని యుధిష్ఠిరుడు అడుగగా భీష్ముడు శాల్మలీవృక్షము, వాయువుల సంవాదమును వినిపించి ఇట్లు చెప్పెను. దుర్బలుడు బలవంతులతో విరోధించుట తగదు. బుద్ధిని మించిన విలువైన వస్తువు మరొకటి లేదు. రాజా! బాలురు, అజ్ఞానులు, అంధులు, బధిరులు, బలశాలులు ప్రతికూలముగ వ్యవహరించినను వారియెడల

క్షమాభావముతో నుండవలెను. పదునెనిమిది అక్షౌహిణి సేనలు కూడా అర్జునునితో సమానముగాదు. రాజా! నేను రాజధర్మము, ఆపద్ధర్మములను విస్తృతముగ చెప్పితిని. ఇక యేమి

వినాలనుకొనుచున్నావని భీష్ముడు అడుగగా యుధిష్ఠిరుడు "భరతశ్రేష్ఠా! పాపమునకు అధిష్ఠానమేమి? దేనివలన పాపప్రవృత్తి కల్గుచున్నది?" అని అడుగగా భీష్ముడు పాపప్రవృత్తికి మూలము లోభమని చెప్పి దానివలన కలుగు అనర్థముల నన్నిటిని వివరించెను. రాగము, ద్వేషము, మోహము, హర్షము, శోకము, అభిమానము, కామము, క్రోధము, దర్పము, తంద్ర, ఆలస్యము, ఇచ్ఛ, ద్వేషము, తాపము, ఇతరులఔన్నత్యమును ఓర్వలేక పోవుట, పాపాచారము ఇవన్నియు అజ్ఞానములే యని చెప్పెను. పరిణామ ఫలము ఒక్కటేయగుటచే ఆజ్ఞానము, అతిలోభము రెండును ఒక్కటే, లోభమును విడిచి పెట్టుట వలన ఐహికము, పారలౌకిక ఆనందము లభించును. ఇంద్రియనిగ్రహమే లోభమును దూరముచేయుటకుపాయము, భీష్ముడు తపస్సు, సత్య గుణముల మహత్త్వమును చెప్పెను. కామము, క్రోధము, శోకము, మోహము, విధిత్స (అనుచిత కర్మ చేయవలయుననుకోరిక) పరాసుత్వము (ఇతరులను చంపవలెనని కోరిక) మదము, లోభము, మాత్సర్యము, ఈర్ష్య, నింద, అసూయ, దైన్యభావమను పదమూడుదోషముల ఉత్పత్తి, వాటి వినాశమునకు పాయమును వివరించెను. నీచపురుష లక్షణములు, వివిధ పాపములు, వాటి ప్రాయశ్చిత్తములను వర్ణించెను. నకులుడు ఖడ్గము ఉత్పత్తిమున్నగు విషయములనడుగగా భీష్ముడు విస్తారముగా చెప్పెను. భీష్ముడు తన ఉపదేశమును విరమించిన తరువాత యుధిష్ఠిరుడు స్వగృహమునకు వెడలి సోదరులతో, విదురునితో ధర్మ, అర్థ, కామములను గూర్చి చర్చించెను. మరల యుధిష్ఠిరుడు భీష్ముని వద్దకు వచ్చి ధర్మమును గూర్చి అడుగగా భీష్ముడు పాపి, మిత్రద్రోహి, కృతఘ్నుడగు గౌతముని కథను వినిపించెను.

**3) మోక్ష ధర్మ పర్వము:-**

ఈ ఉపపర్వమున 192 అధ్యాయములు గలవు. యుధిష్ఠిరుడు భీష్ముని "పితామహా! ధనము పోగొట్టు కున్నపుడు, పత్ని, పుత్రుడు, లేక తండ్రి మరణించినపుడు మనుష్యుడు ఏవిధముగ శోకమును

నివారించుకోవలెనని" ప్రశ్నించెను. పితృ పుత్రుల సంవాదము ద్వారా సత్య ధర్మమును అనుష్ఠించుటయే కళ్యాణ కారణమని చెప్పెను. శంపాకుడను బ్రాహ్మణుని ఉపదేశమును వినిపించి త్యాగము యొక్క గొప్ప తనము చెప్పెను. మంకి యను మునియొక్క కథను వినిపించి అన్ని కోరికల త్యాగము బ్రహ్మప్రాప్తికి ఉపాయమును వివరించెను. ఈలోకమున బుద్ధిని మించిన వస్తువు మరొకటి లేదు. ఒకానొక సమయమున సంపదచే గర్వాంధుడైన ఒక వైశ్యుడు
ఋషికుమారుడగు కాశ్యపునికి రథమునుతగిల్చి క్రిందపడవేసెను. దుఃఖితుడైన మునికుమారుడు నిర్ధనుడు ఈ లోకమున జీవించుట వ్యర్థమనుకొనుచు ప్రాణత్యాగమునకు సిద్ధపడెను. శృగాలరూపమును ధరించి ఇంద్రుడు మునికుమారునకు "ఋషికుమారా! దుర్లభమగు మానవజన్మను పొంది దానియందు దోషములను వెదకుచు ఆత్మహత్యకు పాల్పడుట ఉచితము కాదని" ఉపదేశించెను. కాశ్యపముని జ్ఞానదృష్టితో ఇంద్రునిగా తెలుసుకొని అతనిని పూజించి ఇంటికేగెను. యుధిష్ఠిరుని ప్రశ్నకు బదులుగా భీష్ముడు దానము, యజ్ఞము, గురుశుశ్రూష మున్నగు పుణ్యకర్మల ఫలమును, పాపకర్మలఫలమని తెలియజెప్పెను. భరద్వాజ భృగు సంవాదము ద్వారా స్థావరజంగమజగత్తు ఉత్పత్తి, పంచమహాభూతముల గుణములను వివరించెను. భరద్వాజముని సంశయమును పోగొట్టుచు భృగువు ఇట్లు చెప్పెను. భగవంతుడగు విష్ణువు మహత్తత్త్వమును సృజించెను. మహత్తత్త్వరూప భగవంతుడు అహంకారమును ఆహంకారము ఆకాశమును సృజించెను. ఆకాశము నుండి జలము, జలము నుండి అగ్ని వాయువులు పుట్టినవి అగ్ని వాయువులసంయోగము వలన పృథివి పుట్టెను. పిమ్మట విష్ణువు దివ్యకమలమును సృజించెను. దాని నుండి వేదమయ నిధిరూప బ్రహ్మ ప్రకటితమాయెను. వానికే అహంకారమని నామాంతరము. సమస్త భూత సృష్టి వీరివలననే జరుగునని భృగువు విస్తృతముగ సృష్టి ఉత్పత్తి క్రమమును ఆశ్రమ ధర్మములను భారద్వాజ మహర్షికి చెప్పెను. అవన్నియు భీష్ముడు యుధిష్ఠిరునికి తెలియజేసెను. యుధిష్ఠిరుడు ఆచారవిధినిగూర్చి అడుగగా భీష్ముడు సదాచారసంపన్నుడగు పురుషుడే శ్రేష్ఠుడు సూర్యోదయకాలమున నిద్రించకూడదు. ప్రతిరోజు సూర్యుని ఉపాసించవలెను. ముఖ, హస్త, పాదములను కడుక్కొని

తూర్పునకభిముఖమై భుజించవలెను. భుజించుసమయమున మౌనముగ నుండవలెను. అన్నము రుచిగానున్నను, లేక పోయినను ప్రీతితో భుజించవలెను. అన్నమును నిందించరాదు. ప్రాతఃకాల సాయంకాలభోజనమే విహితము. మధ్యలో తిరిగి భుజించుట నిషిద్ధము. ఈనియమము పాలించువానికి ఉపవాసము చేసినంత ఫలితము లభించునని చెప్పెను. ధర్మమే మనుష్యులకు ప్రాణభూతము. ధార్మికుడు మరణించిన పిమ్మట ధర్మబలముచే సుఖమును పొందునని చెప్పుచు భీష్ముడు అధ్యాత్మజ్ఞానమును వర్ణించి జపధ్యానములమహిమ వాటి ఫలముల ద్వారా ఆత్మతత్త్వ వివేకము, పరబ్రహ్మ ప్రాప్త్యుపాయమును చెప్పెను. శ్రీకృష్ణుని గొప్పతనమును చెప్పుచు పురుషోత్తముడే పృథివ్యాది పంచమహాభూతములను సృజించెను. పృథివిని సృజించి జలమందే తన
నివాసస్థానము నేర్పరచుకొనెను. అతడు మనస్సంకల్పముచేతనే సమస్త ప్రాణులకాశ్రయుడగు సంకర్షణుని సృజించెను. సంకర్షణుడే సమస్తభూతములను ధరించుచున్నాడు. అతడే భూత భవిష్యత్తుల కాధారభూతుడు. పిమ్మట శ్రీకృష్ణుని నాభినుండి దివ్యకమలము ప్రకటితమాయెను. దాని నుండి బ్రహ్మ అవిర్భవించిరి. తదనంతరము శ్రీ కృష్ణుడు పృథివిని సృజించెను. నాల్గు వర్ణములను సృజించి ధాతను వారికి అధ్యక్షునిగా చేసెను. పిమ్మట భూత సృష్టిగావించెను. మొదట్లో మనష్యులు ఎంతకాలము జీవించదలచుకుంటే స్వేచ్ఛగా అంతకాలము జీవించెడివారు. యమరాజ భయము వారికి ఉండెడిది కాదు. స్త్రీ పురుష సంయోగము లేకుండగనే సంకల్పమాత్రంచే సంతానము కల్గుచుండెడిది. త్రేతాయుగమున స్పర్శమాత్రమున సంతానము కలిగెడిది. సంయోగమువలన సంతానోత్పత్తి ద్వాపరయుగమున ఆరంభమాయెను. త్రేతాయుగము ద్వాపరయుగముల సంధి కాలమున రాజులు యుద్ధమందు ఆసక్తులైరి. భరతశ్రేష్ఠ! కేశవుని మానవునిగా తలవరాదు. అచింత్యులగు స్వరూపులు వారు.

యుధిష్ఠిరుని ప్రశ్నలకు సమాధానముగ భీష్ముడు ప్రజాపతి, మహర్షులను వర్ణించెను, గురు శిష్య సంవాదము ద్వారా అధ్యాత్మతత్త్వమును పేర్కొనెను. జీవాత్మస్థితిని చెప్పి మోక్ష ప్రాప్తికి దానిని సాధనముగా చెప్పెను. శరీరము కంటె భిన్నముగ ఆత్మసత్తను

ప్రతిపాదించెను. గృహస్థ ఆశ్రమంలో ఉంటూ సంసారబంధముల నుండి విముక్తి పొందిన మహాపురుషుడున్నచో అతనిని పరిచయము చేయవలసినదని యుధిష్ఠిరుడు అడుగగా భీష్ముడు బ్రహ్మర్షి దేవలుని పుత్రి, ఆమె భర్త శ్వేత కేతువుల అధ్యాత్మవిషయక సంవాదమును వినిపించెను. శ్రీకృష్ణ ఉగ్రసేనుల సంవాదము ద్వారా నారదమహర్షి గుణగణములను వర్ణించెను. వ్యాసభగవానుడు తన పుత్రుడగు శుకదేవుడు అడుగగా సృష్టిప్రళయ కాలముల స్వరూపమును వివరించెను. భీష్ముడు దానిని యుధిష్ఠిరునకు తెలియజెప్పెను. పదిహేను నిమిషములు ఒక కాష్ఠము, మూడు కాష్ఠములు ఒక ముహూర్తము. ముప్పది ముహూర్తములు ఒకరాత్రి పగలు. ముప్పది రోజులు ఒక మాసము, పండ్రెండు మాసములు ఒక సంవత్సరము. మనుష్యలోకమున రాత్రి పగలు అను విభాగమును సూర్యభగవానుడు చేయుచున్నాడు. రాత్రి నిద్రించుటకు, పగలు పనిచేయుటకు. మనుష్యుల ఒక మాసము పితృదేవతలకు రాత్రిపగలు. శుక్లపక్షము పనిచేయుటకు వారికి పగలు, కృష్ణ పక్షము నిద్రించుటకు రాత్రి. మానవుల ఒక సంవత్సరము దేవతలకు ఒకరోజు. ఉత్తరాయణము వారికి పగలు దక్షిణాయనము
రాత్రి. దేవతల నాల్గువేలసంవత్సరములు ఒక సత్యయుగము. ఇందు నాల్గవందల దివ్యవర్షములు సంధ్య, నాల్గువందల దివ్య వర్షములు సంధ్యాంశము కూడా ఉండును. మొత్తము కృతయుగము 4,800 దివ్య సంవత్సరములు త్రేతాయుగము 3600 దివ్య సంవత్సరములు. ద్వాపరయుగము 2400 దివ్య సంవత్సరములు. కలియుగము 1200 దివ్య వర్షములు. ఈ విధముగ చతుర్యుగముల పరిమాణము 12000 దివ్య వర్షములు. సహస్ర చతుర్యుగములు బ్రహ్మగారికి ఒక పగలు. అంతే పరిమాణము ఒక రాత్రి. పగలు ఆరంభమున బ్రహ్మ సృష్టిచేయును. వారి రాత్రి ప్రళయసమయము. ఆసమయమున ప్రాణి కోటిని తనలో లీనము చేసుకొని యోగనిద్రలో నుండెదరు. తిరిగి తెల్లవారగనే సృష్టి ఆరంభమగును. ఈ విధముగ భీష్ముడు వ్యాసులవారు చెప్పిన అనేక విశేషములను యుధిష్ఠిరునకు చెప్పెను.

భీష్ముడు ధర్మ అధర్మ స్వరూపమును వర్ణించెను. ఈ సందర్భమున మహర్షి జాజలి, తులాధారుడను వైశ్యుని ధర్మ విషయక సంవాదమును వినిపించెను. ప్రాచీన ఇతిహాసముల ద్వారా అహింస యొక్క

మహత్త్వమును తెలియజేసెను. మాండవ్యముని జనకుల సంవాదము ద్వారా ధనతృష్ణ పనికిరాదని ఉపదేశించెను. ఇంద్రవృత్రాసురుల యుద్ధము ద్వారా జ్వరము యొక్క ఉత్పత్తి ప్రసంగమును వినిపించెను. మహాశివుని దక్షయజ్ఞభంగము, దక్షుడు చేసిన శివ సహస్త్రనామస్తోత్రమును ప్రస్తావించెను. యుధిష్ఠిరుడు పితామహా! ఇహలోక పరలోకముల యందు మంగళమొనర్చు శుభకర్మ యేమని భీష్ముని అడిగెను. ధర్మము విధిపూర్వకముగ అనుష్ఠించిన ఇహలోక పరలోకముల యందు కళ్యాణమగునని జనకపరశురామ సంవాదముద్వారా తెలియజేసెను. హంసరూపధారి బ్రహ్మ, సంధ్యాగణముల సంవాదము ద్వారా దేని వలన జీవునికి బంధవిముక్తి కల్గునో దానినుపదేశించెను.

భీష్ముడు సాంఖ్యము, యోగములకు భేదము వాటి గొప్పతనమును వివరించెను. వ్యాసపుత్రుడగు శుకదేవునికి వైరాగ్యము కల్గుటకు కారణముచెప్పెను. దానము, యజ్ఞము, తపస్సు, గురు శుశ్రూషల వలన కల్గుఫలమును సూచించెను. శుకదేవుని జన్మవృత్తాంతము అతని వేదాధ్యయనము మున్నగు విశేషములను వర్ణించెను. ఉపాఖ్యానములద్వారా నరనారాయణుల మహత్త్వమును చెప్పెను. విష్ణువుయొక్క హయగ్రీవ అవతారమును వర్ణించెను. జనమేజయ వైశంపాయన సంవాదము ద్వారా వ్యాసమహర్షి వృత్తాంతమును వినిపించెను. వైశంపాయనుడు జనమేజయుని రాజా! దేవి
సత్యవతి యమునా  సమీపద్వీపమున పరాశరముని వలన వ్యాసుని పుత్రునిగాపొందెను. మహర్షి నారాయణుని అంశమే. నారాయణుడే వ్యాసుని పుత్రరూపంలో సృజించెనని చెప్పెను. అదివిని జనమేజయుడు మహర్షీ! మీరు మొదట వసిష్ఠుని పుత్రుడు శక్తి, శక్తి పుత్రుడు పరాశరుడు, పరాశరుని పుత్రుడు వ్యాసుడని చెప్పినారు. కాని ఇప్పుడు మీరు వ్యాసుని నారాయణుని పుత్రుడుగ చెప్పుచున్నారు. ఇందు పరమార్థమేమని ప్రశ్నించెను. వైశంపాయనుడు రాజా! జ్ఞాననిధి వ్యాసుడు వేదార్థమును తెలుసుకోవలెనను కోరికతో మొదట హిమాలయమున ఉండెడివారు. వారు మహాభారతమును రచించిరి. సుమంతు, జైమిని, పైల, వైశంపాయన, శుక దేవులు అయిదురు వారి శిష్యులు. మహర్షి సాంగవేదమును, మహాభారతమును శిష్యులకు చెప్పెడివారు. ఒకసారి శిష్యులు అడుగగా

నారాయణునివలన కల్గిన తన జన్మవృత్తాంతమును వ్యాసమహర్షి చెప్పెను. నారాయణుడు ఏడవ కల్పము ఆరంభమున ఏడవసారి తన నాభికమలమునుండి బ్రహ్మగారిని సృజించి ప్రాణికోటిని సృజించమని వారినాదేశించెను. పిమ్మట భగవంతుడు రాక్షసులనుండి భూభారమును తొలగించుటకు అనేక అవతారముల నెత్తుటకు నిశ్చయించి తన అనేక రూపములను సృజించెను. తదనంతరము శ్రీహరి భోశబ్దముతో సరస్వతిని ఉచ్చరించెను. అచ్చట అపాంతరతముడను సరస్వతీపుత్రుడు ఆవిర్భవించెను. భగవంతుడు సరస్వతీపుత్రుని వేదములను విభక్తము చేయమని చెప్పెను. భగవంతుని ఆదేశము ప్రకారము వారు వేదవిభాగము గావించితిరి. సంతోషించి శ్రీహరి పుత్రా! అన్ని మన్వంతరములలోను ఈ విధముగ నీవు ధర్మ ప్రవర్తకుడవు కాగలవు. కలియుగము రాగానే నీశరీరము నీలవర్ణమును పొందగలదు. వీతరాగుడవు కాగలవు. నీపుత్రుడు పరమేశ్వరకృపచే వీతరాగుడై పరమాత్మలో లీనమగును. ఆసమయమున పరశురాముడు నీకు తండ్రికాగలడు. ఆఋషివలన తండ్రి యింట్లో ఉండెడి కన్యవలన నీవు జన్మించి కానీనుడ వని ప్రసిద్ధిపొందెదవని అపాంతరతమమునితో నారాయణ భగవానుడు చెప్పి తనపనిలో నిమగ్నముకమ్మని ఆదేశించెను. ఈ విధముగ నేను మొదట భగవంతుని అనుగ్రహం వలన మొదట అపాంతరతముడను పేరుతో పుట్టి వారి ఆజ్ఞచే వసిష్ఠకుల పుత్రునిగా జన్మించి వ్యాసునిగా ప్రసిద్ధి గాంచితినని వ్యాసమహర్షి చెప్పెను. భీష్ముడు ఉపాఖ్యానముల ద్వారా ఆశ్రమధర్మములను పాలించెడి మనుష్యుల కొఱకు అన్నిటికంటె ఉత్తమమగు ధర్మమును యుధిష్ఠిరునకు ఉపదేశించెను.

**ఇది శాంతిపర్వ కథాంశము.**